మనం కూడా దేవుడు చెప్పినవాటిలో చాలా పాటించకుండా అంత అవివేకంగాను, దుర్మార్గంగానూ ప్రవర్తిస్తున్నాం. ధనం మీద మనకున్న వ్యామోహంతో దేవుడు చెప్పిన చాలావాటిని మనం ఖాతరు చేయడం లేదు. అబద్ధం ఆడద్దన్నాడు. దొంగతనం చెయ్యద్దన్నాడు. లంచం తీసుకోవద్దన్నాడు. పరాయి ఆడవాళ్ళని తల్లిలా చూడమన్నాడు. చెడు మాట్లాడద్దన్నాడు. ఇంకా ఎన్నో సూచించాడు.

వీటిలో మనం ఎన్ని పాటిస్తున్నాం?

# 76. ఘోర పాపం

చైతన్య మహాప్రభువు కృష్ణ భక్తుడు. ఆయన కృష్ణ ప్రభువు మీద భక్తి గీతాలు ఆలపిస్తూ, నృత్యం చేస్తూంటే, అంతా మైమరచి పోయేవారు. తన జీవితకాలంలో ఆయన లెక్కలేనంత మందిని కృష్ణ భక్తిలోకి ప్రవహింపచేసాడు.

ఓ రోజు ఓ తండ్రి చైతన్య మహాప్రభువు దగ్గరకి వచ్చి మొరపెట్టుకున్నాడు.

"స్వామీ. తాచెడ్డ కోతి వనమెల్ల చెరిచిందన్న సామెతలా వుంది మీ తీరు. మా అబ్బాయి కూడా కృష్ణుడి పిచ్చిలో పడ్డాడు. ఇంటిని, పిల్లల్ని నిర్లక్ష్యం చేసి కృష్ణ భక్తి పారవశ్యంలో మునిగి ఉన్నాడు. వాణ్ణి ఎలాగైనా తిరిగి మామూలు మనిషిని చేసి పుణ్యం కట్టుకోండి."

"అంతటి భక్తి అలవడటం ఎంతో కష్టం. ఆ భక్తిని కొనసాగనీయండి." చైతన్యుడు ఆయనకి నచ్చచెప్పే ప్రయత్నం చేసి విఫలుడయ్యాడు. ఇక తప్పదనుకున్నాక చెప్పాడు.

"ఎవరికైనా దైవభక్తి గిట్టకుండా చెయ్యాలంటే ఒకటే దారి. వాడిని దుర్మార్గుడిగా మార్చాలి. దుర్మార్గుడి మనసు ప్రాపంచిక సుఖాలమీద తప్ప దైవం మీద లగ్నం కాదు."

"ఎలా స్వామీ?"

"ఓ పని చెయ్యి. రోజూ శివాలయంలోని ప్రసాదం దొంగిలించి తెచ్చి, దాంతో వాడి కడుపు నింపుతూండు."

చైతన్య ప్రభువు చెప్పినట్లే చేసాడా తండ్రి. కొద్ది రోజుల్లోనే అతని కొడుకులోని భక్తి మాయమై మామూలు వాడయ్యాడు.

ఎవరైతే దేవుడి సొమ్ము తింటారో వాళ్ళకి అంటే పాపం అసాధారణమైన పాపం. ఆ ఘోర పాపం వదలడానికి ఎన్నో నికృష్ట జన్మలు ఎత్తాల్సి వుంటుంది. అలాగే సన్యాసి సొమ్ము తినేవాడికి కూడా ఘోరమైన పాపం అంటుకుంటుంది.

(మన ఎండోమెంట్స్ శాఖలో పనిచేసే ఉద్యోగస్థులందరి దృష్టిలో ఈ 'మంచి మాట' పడుతుందని ఆశిద్దాం.)

## 77. జ్ఞానార్థి

ఓ వ్యక్తి తత్త్వ జ్ఞానం సంపాదించడానికి దేశాటనకి బయలుదేరాడు. దారిలో అతను ఓ బీదవాడి ఇంటి బయట అరుగు మీద బస చేసాడు. అతని పొరుగున ఉన్న ఓ ధనవంతుడు తన కూతురి వివాహానికి వీరిద్దరినీ ఆహ్వానించాడు. ఇద్దరూ భోజనానికి ఒకే పంక్తిలో పక్కపక్కనే కూర్చున్నారు. శుద్ధమైన నెయ్యితో చేసిన రుచికరమైన లడ్డూలు వడ్డించారు. బీదవాడు వాటిని తృప్తిగా తిన్నాడు. ఇంకా తినాలని ఉన్నా మొహమాట పడి మారు అడగలేదు. ఇద్దరూ ఇంటికి తిరిగి వచ్చాక ఆ బీదవాడి మనసు లడ్డూల మీదకి పోయింది.

తన రెండువారాల సంపాదనని అప్పు తెచ్చుకుని, కావలసిన దినుసులు కొనుక్కువచ్చి భార్యకి ఇచ్చి లడ్డూలు చేయమని కోరాడు. ఎప్పుడు చేయడం పూర్తవుతుందా, ఎప్పుడు తిందామా అని అతను కాచుకున్నాడు. పూర్తయ్యాక భార్య ఇచ్చిన లడ్డూలని ఇరవై నిముషాల్లో తినేసాడు. పధ్నాలుగు రోజుల సంపాదనంతా అరగంటలో నాలిక మీంచి గొంతు జారి కడుపులోకి వెళ్ళింది.

మర్నాడు భార్యతో చెప్పాడా బీదవాడు.

" అప్పు తీరాక మళ్ళీ ఇంకోసారి లడ్డూలు చెయ్యి. మనసు తీరలేదు."

అతనింటి బయట అరుగు మీద బస చేసిన తత్త్వ జ్ఞానార్థికి, తిన్నది మళ్ళీ మళ్ళీ తినాలనిపించే బీదవాడి మనసు యొక్క స్వభావం అర్థం అయింది. ' ఇతను కాదు లడ్డూని తిన్నది. లడ్డూనే ఇతన్ని తిన్నది' అతనికి అనిపించింది.